# శిష్టప్రశ్న

ఎవరైనా అందమైన చెప్పులు తొడుక్కుంటే మనము చూచి 'ఎక్కడ కొన్నారండీ యివి, బాగున్నాయి' అని అంటాము ఆ మాటలు మనం ఏదో యథాలాపంగా అనాకాంక్షితంగా అంటామే కాని ఆ చెప్పులు మనకు కావాలనే కోరికను మనస్సులో పెట్టుకొని అనము కదా!

కాని కాంతయ్యగారు నా విషయంలో అల్లాగ అనుకొన్నారని అన్నగారు చెప్పారు. అనుకుంటే అనుకోనే వుండవచ్చు. ఎందుకంటే దాని తరువాత జరిగిన కొన్ని విషయాలు అల్లాగ అనుకోంటానికి అవకాశం ఇచ్చినవి.

అసలు జరిగింది ఏమిటీ అంటే — రెండు నెలలక్రింద నేను బెజవాడకు వెళ్ళాను. రేడియో స్టేషనులో ఏదో పని ఉంటే చూచుకువస్తుంటే శాస్త్రి కనపడి, 'మీ అన్నగారు వచ్చారయ్యా, డాక్టరుగారింట్లో వున్నారు' అన్నాడు. సరే ఆ రోజున ప్రయాణం మానేసి డాక్టరుగారింటికి వెళ్ళాను. అన్నగారిని కలుసుకొన్నాను. మేము ఇద్దరం మాట్లాడుతూ వున్నప్పుడే డాక్టరుగారి స్నేహితులు కాంతయ్యగారు వచ్చారు. అన్నగారు ఆయనను నాకూ నన్ను ఆయనకూ పరిచయం చేశారు. ఆ మాట ఎందుకు అనవలసి వచ్చిందో జ్ఞాపకం లేదుగాని నేను మటుకు కాంతయ్యగారితో 'మీ చెప్పులు బాగున్నయి అండీ' అని అన్నమాట నిజం.

ఆ రాత్రి నేను అక్కడే పడుకొన్నాను. చాలా ప్రొద్దు పోయిందాకా అన్నగారూ నేనూ మాట్లాడుతూ కూర్చున్నాము. పన్నెండింటికి కాబోలు నిద్రపట్టింది. మళ్ళీ వెంటనే లేచాను, మూడుగంటలబండికి బందరు వెళ్ళిపోవటానికి. ఆ బండికి వెళ్ళకపోతే మరునాడు స్కూలుకు అందుకోలేను.

అందుకని రెండున్నరకే లేచాను. అరగంటలో రైలు స్టేషనుకు వెళ్ళాలి, సుమారు ఒక అరమైలు నడచి. అన్నగారిని లేపి నేను వెడుతున్నానని చెపితే ఆయన 'తొందరగా వెళ్ళు, టైము కావచ్చిం'దన్నాడు.

అక్కడ లైటు లేదు. చీకటిగా వుంది. లేవటమే ఆలస్యంగా లేచాను. పైగా ఆయన టైము అయిందనికూడా అన్నారు.

అందుకని హడావుడిగా బయలుదేరాను. నా చెప్పులు కనపడలేదు. అక్కడ నాలుగైదు జతలున్నవి. అన్నీ కొంచెం హెచ్చు తగ్గుగా ఒకే మోస్తరుగా వున్నవి. అయినా నేను నా బుద్ధినంతా వినియోగించే నా చెప్పులు జాగ్రత్తగా ఏరుకొని తొడుక్కొనివెళ్ళాను. స్టేషనులోనికి వెళ్ళి దీపాలముందు చూచుకొందునుగదా, అవి నావి కాదు!

ఆ చీకటిలో, హడావుడిలో, నిద్రమత్తులో పొరపాటున అవి తొడుక్కొచ్చాను. అవి నాకు సరిగ్గా సరిపోవటం మూలాన అవి నావి కావేమోనని అనుమానం అన్నా కలగలేదు.

అవి కాంతయ్యగారి చెప్పులు! అరెరె! ఎంతపని జరిగింది. ఇప్పుడెల్లాగా - అనుకొన్నాను. కాని ఏంలాభం. బండి బయలుదేరే సమయం అయింది. వెళ్ళి యిచ్చి రావటానికి టైములేదు. ఒకవేళ వెళ్ళినా ఆ చీకట్లో నా చెప్పులు కనపడతయ్యా ఏమన్నా నా. ఈ తభాను వెళ్ళిపోదాము. మళ్ళీ పదిరోజులలో బెజవాడ వస్తునేవుంటిని. అప్పుడు యీ చెప్పులు యిచ్చేసి నావి నేను తీసుకొనిపోవచ్చును. ఇంతలో వచ్చిన ప్రమాదము యేముంటుందిలే అని అనుకున్నాను. గాని, యిదంతా ఒక పెద్ద అల్లరిఅయి నామీద విసుచుకు పడుతుందని నేను అనుకోలేదు. ఇంతకూ సరిగ్గా ఆలోచించ టానికి టైముకూడా లేకపోయింది. రైలు కూసింది. నేను చటుక్కున బండిలో యెక్కి కూర్చున్నాను. ఆ చెప్పులు నా కాళ్ళనే వుండిపోయినయి.

నా చెప్పులు డాక్టరుగారింట్లో వదిలేసి వచ్చాను. కాబట్టి యీ చెప్పులతే నేను తొడుక్కొని తిరగవలసిన అగత్యం యేర్పడ్డది. అందుకని వేసుకు తిరుగుతున్నాను.

ఆ చెప్పుల అడుగున కొద్దిగా చినుగులు వున్నయి. రోడ్డుమీద నడుస్తుంటే గులకరాళ్ళు కాలిగి గుచ్చుకొంటు న్నవి. అందుకని రబ్బరుటైరు వేయిస్తే కాలిక్రింద మెత్తగా వుంటుంది - వేయిద్దామా అని ఒక ఆలోచన వచ్చింది. అవి మళ్ళీ యిచ్చేసేవేగదా, యెందుకు ఓ పావలా దండుగ పెట్టడం అనికూడా అనుకొన్నాను. అనుకున్నవాడిని ఊరుకోకూడదూ! కర్మ ఊరుకోనియ్యలేదు. పోనీలే, వున్నావాళ్ళు హాయిగా

తొడుక్కుందాం, పావలాలో వచ్చిన నష్టం యేముంది. అని అనుకొని రబ్బరుపైకుసోలు కూడా వేయించాను.

చెప్పులు బహుశః యీమధ్య చాలా అందంగా వున్నయి. ప్రతి వాడూ చూచి, 'చాలా బాగున్నాయి – ఎక్కడ కొన్నావో చెప్పు' అని అడగటం సాగించారు.

ఏం చెప్పేది జవాబు! యివి నావి కావు, యెవరివో తొడుక్కొని వచ్చానని యెట్లా చెప్పేది! అందుకని 'యివి యీ వూళ్ళో కొన్నవి కావు, మద్రాసులో కొన్నాను' అని చెప్పవలసివచ్చింది.

నేను ఆయన చెప్పులు తొడుక్కొని తిరుగుతున్నాననీ, వాటికి రబ్బరుసోలు వేయించి స్వంతం చేసుకొన్నాననీ పైగా మద్రాసులో కొన్నానని చెబుతున్నాననీ కాంతయ్య గారికి తెలిసిందట. ఇక ఆయన నన్ను గురించి ఏమనుకొంటాడు!

కర్మ అల్లాగ తోసుకొచ్చింది. నేను ఆరోజునే అనాలోచితంగా మీ చెప్పులు బాగున్నయి అనటం, అవే తొడుక్కొని రావటం, అందరితోనూ మద్రాసులో కొన్నానని చెప్పటం, పైగా అవి నా స్వంతమే అయినట్లు బాగు చేయించుకోవటమూ యివన్నీ కలిపి ఆలోచిస్తే ఆయనకు యేంతోస్తుంది! నేను కావాలని బుద్ధిపూర్వకంగా ఆ చెప్పులు యెత్తుకొచ్చానని ఆయన అనుకొన్నాడంటే అందులో ఆశ్చర్యపడాలిసిన విషయం లేదు. అనుకొనే వుంటాడు.

కాని దైవసాక్షిగా చెబుతున్నాను; నాకు అటువంటి వుద్దేశం యేకోశానా లేదు. అనాలోచితంగా చేశాను యీ పనులన్నీ. దాని ఫలితం అనుభవించాను.

ఈ చిన్ని పొరపాటువలన యింత వుపద్రవం వస్తుందని నేను అనుకోలేదు. అన్నగారు వచ్చి చెప్పిందాకా నాకు ఆ విషయమే తోచలేదు. ఒకరోజున ఆయన నాకు కనపడి, 'నీవు డాక్టరుగారింటికి వచ్చిన ఓ పెద్దమనిషి చెప్పులు తొడుక్కొని వచ్చావుటగదా' అన్నారు. 'నిజమే పొరపాటున తొడుక్కొచ్చాను. ఈ తఫా బెజవాడ వెళ్ళినప్పుడు యిచ్చేస్తాను' అన్నాను.

ఈ పని నేను బుద్ధిపూర్వకంగా చేశానని ఆయన అనుకొని పోతాడని నాకు గుండెలలో భయంగానే వుంది. అందుకని అనేక విధాల ప్రాధేయపడి, చెప్పాను - దురుద్దేశం యేమీ లేదనీ, కేవలం పొరపాటనీ!

చెప్పంగా చెప్పంగా ఆయన నమ్మారు. నామీద కాస్త జాలికలిగింది కూడా. కలిగి యిల్లాగ అన్నారు.

'సరే, యేదో అయిపోయిందేమో అయిపోయింది. చెప్పులు మళ్ళీ యియ్యక్కద్దు - పెట్టొద్దులే. ఊరుకో. ఆ చాయలకుమటుకు పోవద్దు. బెజవాడకు యేదైనా పనిమీద వెళ్ళినప్పుడు కాస్త అటూ, యిటూ, వెనకా, ముందూ చూస్తూ నడు, ఆ కాంతయ్య కనపడతాడేమోనని! అతడుగాని అతని స్నేహితులుగాని కనపడితే, కాస్త తప్పించుకు తిరుగు.'

'ఏమండీ, ఎందుకు అల్లాగ అంటున్నారు?' అన్నాను.

'వాళ్ళు - నీవు బుద్ధిపూర్వకంగానే ఆ చెప్పులు తీసుకొని వెళ్ళావని అనుకొంటున్నారు. అందుకని వాళ్ళకు కోపంవచ్చింది. వాళ్ళు యేంచేసినా చేయగలరు. తీరా చెయ్యి చేసుకొన్నతరువాత యేమనుకొని యేంలాభం?

ముందుగా జాగ్రత్తపడు. ఎందుకు చెప్పానో నా మాటవిను'
అన్నారాయన.

నన్ను గురించి అవతలవాళ్ళు యిల్లాగ అనుకొన్నారని విని నేను నిలువున నీరైపోయినాను. దుఃఖంవచ్చి అన్నాను, 'మీరైనా చెప్పకపోయినారా అన్నగారూ, నేను అల్లాంటి మనిషి కాదు, పెద్దమనిషి నని.'

నా మాటలు ఆయన విని విచారంగా ముఖంపెట్టి 'చెప్పాను తమ్ముడూ, చెప్పాను. అయితే యేంలాభం. వాళ్ళు వినలేదు. నీవు పెద్దమనిషిలాగ వాళ్ళకు కనుపించలేదుట!' అన్నారు.

నాకు చాలా కష్టంకలిగింది. దుఃఖం వచ్చింది. అన్నగారుకూడా చాలా విచారపడుతున్నట్లు కనపడ్డారు. ఇద్దరం కూడా కాసేపు మాట్లాడకుండా, ఒకరినొకరు చూస్తూ కూర్చున్నాము. ఆయన కళ్ళల్లోనూ, ముఖవైఖరిలోనూ, కనబడుతూనే వుంది-ఆయనకు నాయందు సానుభూతివున్నట్లు. ఆయన నాయందు జాలిచూపుతూ చివరకు 'యిక యెందుకులే అదంతా. అయినా నీవు చేసేది యేమీలేదు. నీ జాగ్రత్తలో నీవు వుండు' అని హితవుచెప్పి వెళ్ళిపోయినాడు. 'ఇట్లా వచ్చిందేం కర్మం' అని అనుకొని నేను ఆ వంతెనపైన అల్లాగే కూర్చున్నాను.

సంజె కాంతులు క్రమంగా మాయమైనవి. చీకట్లు కమ్ముకొన్నాయి. ఈ విచిత్రాన్ని చూచి నక్షత్రాలు నవ్వుకొన్నాయి. నేను యీ అవమానంలోనుంచి ఎట్లాగ బైట పడాలో తోచలేదు.

ఎంత ఆలోచించినా అన్నగారు చెప్పినదానికంటే మంచి ఆలోచన యింకొకటి యేదీ తోచలేదు. దాని తరువాత ఒకటి రెండుసార్లు బెజవాడ వెళ్ళినాకూడా ఆ డాక్టరుగారి యింటివైపు వెళ్ళలేదు. బజారులో తిరిగేటప్పుడుకూడా వాళ్ళ కళ్ళపడలేదు. కాని ఆయన నన్ను పెద్దమనిషిగా యెంచలేదే! నాలో పెద్దమనిషితనం యే విధంగా లోపించిందా అన్న విచారంముట్టుకుని నన్ను విస్తారం బాధపెట్టింది. ఈ నా ప్రవర్తన వాళ్ళ అనుమానాన్ని మరీ బలపరుస్తున్నదీ – అన్న విషయం డాక్టరుగారి దగ్గరనుంచి ఒక రోజున ఉత్తరం వచ్చిందాకా నేను గుర్తించలేదు. ఆ ఉత్తరంలో యిట్లా వ్రాశారు.

'మీరు మా యింటికి రావటం బొత్తిగా మానేశారు. ఈమధ్య బెజవాడ ఒకటి రెండుసార్లు వచ్చికూడా నన్ను చూడకుండా వెళ్ళిపోయినారు. ఇదేమీ బాగుండలేదు. నేనూ, యితర స్నేహితులూ మిమ్ముల్ను చూడాలని తహతహలాడుతున్నాము. ఈ తడవ మీరు తప్పక రండి. రాకపోతిరా మాటదక్కదు.'

ఈ ఉత్తరాన్నిబట్టి వాళ్ళ వుద్దేశం స్పష్టంగా తెలిసిపోయింది. అన్నగారు చెప్పింది అక్షరాలా నిజం అయింది అనుకొన్నాను. మాటదక్కదు అనటంలో వాళ్ళ వుద్దేశం తెలియనే తెలిసింది.

కాని యెన్నాళ్ళని యిల్లాగ తప్పుకు తప్పుకు తిరగటం. ఛీ, యిది దొంగపని అనిపించింది. నా ప్రవర్తన నాకే అసహ్యం వేసింది.

అప్పుడు నాకు ఒకటితోచింది. ఈతడవ వెళ్ళినప్పుడు యేమైనాసరే వాళ్ళ చెప్పులు వాళ్ళకు యిచ్చేయాలె. ఇచ్చి క్షమించమని కోరాలె. క్షమిస్తారా సరేసరి – క్షమించరూ, జరగవలసింది జరగనీయి. అంతేకాని దొంగపని చేసిన వాడిలాగ యిల్లాగ భయపడుతూ తప్పుకు తప్పుకు తిరగటం మటుకు మంచిపనికాదని నిశ్చయించుకొన్నాను.

చెప్పులుకూడా కొత్తగానే వున్నవి. రంగుపోలేదు. అరిగిపోలేదు. అడుగున రబ్బరుటైరు వేయటం మూలాన సుఖకరంగా కూడా వున్నయి. ఆ ఆసామీ వీటిని మళ్ళీ చూచినప్పుడు, పాపం జాగ్రత్తగానే వాడాడు. తొక్కి పాడు చేయలేదు అని అనుకొంటాడుగదా అని నేను కాస్త తృప్తి పడుతూ వుండేవాడిని.

ఆ చెప్పులు తొడుక్కున్నప్పుడల్లా అనుకుంటూ వుండేవాణ్ణి. ఇక ‘పదిరోజులలో యిచ్చేస్తాను. మాట దక్కుతుంది’ అని రోజులు లెక్కపెడుతున్నాను.

ఇంతలో ఒక విచిత్ర సంఘటన జరిగింది. అది జరక్కపోతే నేను బ్రతికి బైటపడేవాడిని, కాని జరిగింది! అది యేమిటి అంటే —

శనివారంనాడు పొద్దున నేను కాఫీ తాగి కుర్చీలో కూచ్చుని యేదో చదువుకొంటున్నాను. ‘నీకోసం ఎవరో వచ్చారు నాన్నా!’ అని అబ్బాయివచ్చి చెప్పాడు. ఎవ్వరో కనుక్కోకపోయినావురా, అంటే ‘కనుకున్నాను నాన్నా. వారిది బెజవాడట’ అన్నాడు.

బెజవాడనుంచి యెవరో వచ్చారనేసరికి నా గుండె గుభేలుమన్నది. కొందరు పాములాగ పగపడతారు. బెజవాడ నుంచి అయితే వాడే అయివుంటాడు – ఇంకెవరు వున్నారు రావటానికి?

అతను రాకముందే నేను వెళ్ళి ఆయన చెప్పులు ఆయనకిచ్చేసి వున్నట్లయితే యెంత బాగుండేది! ఏదో పొరపాటున పాపం, తీసికెళ్ళాను. మళ్ళీ తీసుకొని యిచ్చేశాను. తొక్కి పాడుచేయలేదు కూడా అని అందరూ అనుకొనేవాళ్ళు! అల్లాగ మాటదక్కించుకోటానికి అవకాశం లేకుండా ఆయన రానేవచ్చె! కర్మం కాకపోతే యేమిటిది!

ఇప్పుడేమనుకుంటాడు. దురుద్దేశం వుండబట్టే ఇన్నాళ్ళ నుంచి యియ్యలేదు. నిజంగా యే దురుద్దేశం లేకపోతే బెజవాడకు రెండు మూడుసార్లు వచ్చికూడా యెందుకు యియ్యకపోవాలి అని అనుకోడూ!

వెళ్ళి యిద్దామని అనుకొంటూనే వున్నాను. ఇంతలో యీయన రానేవచ్చె! యేంజేసేది! పాపం ఆ డాక్టరుగారు నీవు చెప్పులు తీసికెళ్ళావు అని నోటితో అనకుండా ఆ సంగతి జ్ఞాపకం వచ్చేటట్లు వుత్తరం వ్రాశాడాయె! అప్పుడైనా వెళ్ళి వాళ్ళ వస్తువు వాళ్ళకు యిచ్చి రాకపోతిని.

ఛీ ఛీ అన్నీ తెలివితక్కువ పనులు చేశాను. ఇప్పుడాయన తీరా ఆయనవచ్చి వాకిట్లో కూర్చునె! పైగా నేను యిన్నాళ్ళూ తప్పించుకు తిరుగుతున్నట్లు కూడా ఆయనకు తెలుసు! 'ఏమయ్యా ఏంపని ఇది' అని నిలవేసి నాలుగూ అడిగితే ఏంజెప్పేది? ఇప్పుడు నాకు దురుద్దేశం లేదని యెంత చెప్పితే

వే లాభం! నమ్ముతాడా యేమన్నా నా! ఇల్లాగ పరిపరి విధాల మనస్సు పోయి యమయాతన పడ్డాను కాసేపు.

చివరకు యేమన్నా కానీయమని వసారాలోకి వచ్చాను. అక్కడ కూచున్నది కాంతయ్య కాదు. యెవరో కొత్త మనిషి.

ఒక్క నిమిషంసేపు ఆలోచించాను - యీయన యెవరూ అని! అట్టేసేపు ఆలోచించకుండానే ఆయన యెవరై ఉండేదీ నామనస్సుకు తోచింది. ఈయన తప్పకుండా కాంతయ్య పంపిన మనిషి! ఆ ముఖమే చెప్తున్నది - చెప్పులకోసం వచ్చినట్లు.

ఇదీ ఒకందుకు మంచిదే అనుకొన్నాను. అసలు ఆయనకు ఉన్నంత కోపం, ఈయనకు ఉండదు. ఈయన కిచ్చి పంపేస్తే సరిపోతుందని కాస్త మనస్సుకు శాంతి గలిగింది.

వెంటనే చెప్పులు తెచ్చి ఆయన ముందు పెట్టి 'క్షమించండి. పొరపాటున తొడుక్కొచ్చాను' అని అనేవాణ్ణే కాని ఆక్షణంలో ఒక సందేహం వచ్చింది. అసలు ఈయన కాంతయ్య పంపిన మనిషేనా అని!

కాంతయ్య పంపిన మనిషి కాకపోతే మనింటికి ఎందుకొస్తాడు? ఆ వాలకం తెలుస్తూనే ఉంది. కాని అయినా యెందుకో ఆ సందేహం వచ్చింది.

వచ్చి, 'ఏమండీ, చెప్పులకోసం వచ్చారా?' అని అడిగాను. ఆయన అడిగిందాకా ఉండకుండా మనమేమి ఒదు ఆయన వస్తువ ఆయన కియ్యటానికి ఆదుర్దా కనపర్చటంవలన, మన నిర్దోషిత్వము కొంత ప్రకటితము అవుతుందని నా ఊహ.

ఆ పెద్దమనిషి తెల్లపోయి, 'చెప్పలేమిటండీ?' అన్నాడు.

నేనూ తెల్లపోయినాను, యీాయన కాంతయ్యగారు పంపిన మనిషి కాకపోతే ఇంకెవరా అని!

ఇంకా నయం–చెప్పులు రెండూ తెచ్చి ఆయన ముందు పెట్టి క్షమించమన్నాను కాను. అన్నట్టయితే చెప్పుల బోటు పని అయ్యేది అనుకొని, 'నేను ఏదో, అనుకున్నాను లెండి, అయితే మీారు ఎవరో, ఎందుకొచ్చారో చెబుతారా' అన్నాను.

ఆ పెద్దమనిషి "మాది గుడివాడండి – శాస్త్రి గారు పంపారు" అని మిగతా విషయము నన్ను గ్రహించమన్నట్లు చూశాడు.

నేను నిర్ఘాంత పోయినాను. ఈశాస్త్రి యెవరు నా ప్రాణానికి! కాంతయ్య చెప్పులు తెచ్చినట్టుగా వాడిగాడు గేమైనా తెచ్చాడా యేమిటి ఖర్మం ఎప్పుడైనా! నాకేమి జ్ఞాపకం రాలేదు.

ఆ వచ్చిన పెద్దమనిషి ఆ ఒక్కమాట అని ఊరుకున్నాడు. ఆపేరు చెపటంతోనే ఏదో విషయం జ్ఞాపకం వస్తుందని ఆయన ఊహ అయిఉంటుంది. అల్లాగ జ్ఞాపకంవచ్చే మనశ్శైనిమిత్యము నాకు లేదాయె!

నామనస్సు ఒక్క దారిలోనే పనిచేస్తున్నది. అన్ని విషయాలు జ్ఞాపకం తెచ్చుకొనే శక్తి లేదు ఆయన అల్లాగ చూస్తూ ఉండిపోవటంవల్ల నాకు చికాకెత్తింది. "ఏమిటి

చెప్పాలా, గోడుగా? తొందరగా చెప్పు నన్ను చంపక? అని అనేటంతటి విసుగ్గా ఉంది. అదృష్టవశాత్తు అన లేదు

నా ఆందోళనచూచి, గ్రహించి, ఆయన ఓ చిన్న ప్రకటన కాయితం నా చేతి కిచ్చాడు.

ఆ కాయితంలో విషయాలు చూచినతరువాత నాకు జ్ఞాపకం వచ్చింది, ఆ శాస్త్రి ఎవరో, ఆ సంగతి ఏమిటో !

నేను నవ్వుకొని "ఊఁ, నిజమే. మరిచిపోయినాను సుమండీ!" అన్నాను.

'శాస్త్రిగారూ ఆ మాటే చెప్పారు!' అన్నాడు ఆ వచ్చిన పెద్దమనిషి.

'ఏమని చెప్పారు?'

'తమకు తగని మరుపని!' అని నవ్వాడు ఆయన. ఈ జబ్బుకూడా నాకు ఉందని అందరూ అనుకొంటున్నా రన్నమాట అని – నా కర్మాన్ని నేను నిందింకొంటూ – పైకి మాత్రం నవ్వుతూ, 'సరేలెండి. రెండుగంటల బండిలో బయలుదేరి వస్తాను. మీరు ముందు వెళ్ళండి' అన్నాను.

వెళ్ళటానికి ఇష్టంలేనట్లు ముఖంపెట్టి ఆయన 'అల్లా క్కాదండీ, చుట్టుప్రక్కల ఊళ్ళనుంచికూడా చాలామంది సభకు వస్తున్నారు–ప్రత్యేకంగా మీ ఉపన్యాసం వింటానికి! మీరు రాకపోతే, వాళ్లు మమ్మల్ని బ్రతుకనియ్యరు. దయ చేసి ఈ పదకొండు గంటల బండికే బయలుదేరండి' అంటూ కూర్చున్నాడు.

'ఇంకా వంటకాలేదు. భోజనం చెయ్యాలె. సడదు. కాని నా మాటవిని, మీరు వెళ్ళండి ఈ బండికి. నేను రెండు గంటల బండికి తప్పకవస్తాను' అన్నాను.

అంటే నమ్మడే! ఎంత చెప్పినా నమ్మడు. చివరకు నేను అన్నాను. 'మీరు ఏమన్నా అనండి. ఈ బండికిపటుకు రాను. రెండుగంటల బండికి తప్పకవస్తాను!'

''అయితే నేనూ రెండుగంటల బండిదాకా ఉంటాను! మీరూ నేనూ కలిసేపోదాము. మిమ్ములను వెంటబెట్టుకొని రమ్మన్నారు శాస్త్రిగారు. ఆయన 'వస్తాను మీరు పొండి' అంటారు. 'వస్తానుగదా, అని నీవు అల్లాగ రాకుసుమీ' అని ఆయన మరీ, మరీ చెప్పారు'' అన్నాడు ఆయన.

నామాటమీద విశ్వాసంకూడా లేదన్నమాట వీళ్ళకు! ఒకరి కేమన్నా నేను పెద్దమనిషిగా కనుపించ లేదూ! ఇంకొకరి కేమన్నా నామాటయందు విశ్వాసం లేదూ! ఇట్లాగుంది కదా ప్రపంచం!

ప్రపంచంసంగతి అట్లావుంచి ఇప్పుడీ పెద్దమనిషిని పంపటం ఎట్లా! పంపక భోజనానికి లెమ్మనాలిసిందేనా అని తటపటాయిస్తూ ఉండగానే, ఆయన కడుపుచల్లగావుండా, ఆయన అన్నాడు: 'మాస్టరుగారూ, నేను మా అక్కగారింటికి వెళ్ళి భోజనంచేసి వస్తాను. మీరు మీ ఇంటిపద్దే ఉండండి, నేనొచ్చి తీసికెడతాను.' అని! తరువాత ఆయనను మాయింట్లో భోజనం చేయవలసిందని కోరాను. ప్రాధేయ పడ్డా ననుకోండి. అయితే ఆయన ఉండనూలేదు. వెళ్ళి భోజనంచేసి ఒక గంటలో వచ్చాడు.

రెండుగంటల బండిలో గుడివాడ వెళ్ళాము. నేను అక్కడ ఉపన్యాసం ఇచ్చాను. జనం చాలామంది వచ్చారు. నేను సంతోషించాను ఇంతమందిని నవ్వించగలిగానుకదా అని.

ఉపన్యాసం అయినతరువాత యువకులు నా చుట్టూ చేరి ఏవో కొన్ని ప్రశ్నలు అడగటమూ వారందరికీ నేను సమాధానాలు చెప్పటమూ జరిగింది.

ఇది అంతా అయినతరువాత వచ్చి చూచుకొందును గదా; నా చెప్పులు లేవు. ఎవరో తొడుక్కుని వెళ్ళారు. నా చెప్పులూ అంటే మరేవీకావు, అవే!

అప్పటికి అందరూ వెళ్ళిపోయినారు-నాతో మాట్లాడు తూవున్న ఏకొద్దిమందో తప్ప! ఎవరిని అడిగేది?

'ఇవి నావికావు' అని చెప్పితే దయదల్చి ఇచ్చివేసే వారేమో కాని అసలు ఆమాట ఎట్లా చెప్పేది!

'పోతే పోయినవిలెండి మాస్టారూ, వాటికోసం ఊరికే ఇది అవుతారు ఎందుకు?' అన్నాడు ఓ కుఱ్ఱవాడు.

ఎవ్వరికీ విచారంగా లేదు. నేను విచారపడటం అందరికి నవ్వులాటగా వుంది. చేసేది ఏమీలేక వట్టికాళ్ళతో ఇంటికి వచ్చేశాను.

ఇంట్లో మా ఆవిడకు ఈ సంగతి తెలిసింది. ఇక ఆవిడ ప్రారంభించింది సాధింపు.

'అయ్యో, అయ్యో మీ తెలివితక్కువతనము తెల్ల వారా! ఇప్పు డెట్లాగండి. ఏముఖం పెట్టుకొని చూస్తారండి, ఆ కాంతయ్యగారిని?'

'ఏ ముఖం పెట్టుకొని చూసేది. ఈ మామూలు ముఖం పెట్టుకొనే చూడాలె!'

ఆవిడ మళ్ళీ ఎత్తుకొని యిట్లా అన్నది. ''ఆయన చెప్పులు ఆయనకిస్తే ఎంతమర్యాదగా ఉండేది! ఇప్పుడేమును కొంటాము !'

అవును, ఆయన ఏమనుకొంటాడో తెలియబట్టే విచారపడుతున్నాను.

మళ్ళీ మొదలు. 'అసలు మీరు ఆ చెప్పులు తొడుక్కు రావటమే తప్పుకదా. ఇక పారేస్తే! అయ్యో మీరు చేసేవన్నీ ఇటువంటిపనులే. మధ్య నేను చస్తున్నాను' అన్నది ఆవిడ.

ఎన్నిమాటలు అన్నా ఊరుకొన్నానుగాని చివరకు 'మీరు చేసేవన్నీ ఇటువంటి పనులే' అన్న మాటమాత్రం నాకు కష్టం కలిగించింది. అన్నీ ఇటువంటి పనులేనా? ఇంకో రకంపనే నాకు లేదన్నమాట! అంటే నేను పచ్చి దొంగను అన్నమాట! అందులో అదేవృత్తిగా పెట్టుకొన్న దొంగను!!

ఆమాటమీద కాసేపు ఆవిడతో పోట్లాడాను.

వెధవ చెప్పులవిషయమై కథ ఊహాభారతంలాగ పెరిగి పోతున్నది. సభాపర్వము అయింది. యుద్ధపర్వముకూడా పూర్తియింది.

ఆ చెప్పులు ఎప్పుడో తీసికెళ్లి వాళ్ళకు ఇచ్చేయ వలసింది. అనవసరంగా నెత్తిమీదికి తెచ్చిపెట్టుకొన్నాను. ఇప్పుడు విచారించి ఏం లాభం!

ఆ తరువాత నాలుగురోజులకు బెజవాడ వెళ్ళాను. రేడియోస్టేషనులో పని అయిపోయింది. ఇక ఆ డాక్టరు గారింటికెళ్ళి క్షమాపణ చెప్పుకోవాలా !

ఎట్లా వెళ్ళేది! చెప్పులుఉంటే తీసికెళ్ళి యిచ్చి 'క్షమించండి ఆలస్యమైనందుకు' అంటే అదో మోస్తరుగా ఉండేది.

మా ఆవిడ అన్నట్లు ఇప్పుడు ఏముఖంతో వెళ్ళేది! కాసేపు ఆలోచించి, ఛీ, ఇక ఈ జన్మకు ఆవైపుకు వెళ్ళే యోగ్యత లేదు. అని అనుకొని, ఇంటికెళ్ళి పోదామని స్టేషను రోడ్డుపట్టాను.

ఆ కాంతయ్య కనపడతాడేమోనని భయం. బిక్కుబిక్కుమంటూ అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాను.

ప్రపంచంలో విచిత్రమైన విషయము ఏమిటి అంటే, ఏది రాకుండా ఉండాలనుకొంటామో అదే వస్తుంది! ఏది జరక్కుండావుంటే బాగుండును అనుకుంటామో అదే జరిగి తీరుతుంది ! ఆ రోజున డాక్టరుగారు కనపడకుండా ఉంటే బాగుండునని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాను. ఆయన కనపడనే కనపడ్డాడు !

ఆయనకారు నా పక్కనుంచి వెళ్ళినప్పుడే నేను ఆయనను చూశాను. చూచి చటుక్కున తల వంచేసుకొన్నాను. ఆ కారు కాస్తదూరం పోయి ఆగింది.

డ్రైవరు దిగివచ్చి 'మిమ్మల్ని రమ్మంటున్నారండీ, డాక్టరుగారు' అన్నాడు. ఇంకా వెళ్ళకుండా ఎల్లాగుండేది? వెళ్ళాను.

ఆయనను చూచేసరికి నాకు చచ్చినచావు అయింది. విచారంగా ముఖంపెట్టి 'క్షమించండి' అన్నాను. ఆయన నవ్వుతూ 'ఎందుకు?' అని తలుపు తెరిచి చెయ్యి అందిచ్చాడు. ఆదరణతో పలకరించి పక్కన కూర్చోబెట్టుకొన్నాడు. నేను మామూలు పద్ధతిలో కులాసాగా మాట్లాడకపోవటం ఆయనకు కష్టంగా ఉంది కాబోలు.

ఆయన 'ఏమండీ, మీకు వంట్లో ఆరోగ్యంగా లేదా?' అన్నాడు.

'ఆరోగ్యంగా లేకేం. బాగానే ఉన్నాను' అని విచారంగా తలవంచుకొన్నాను.

ఆయన 'ఏదో ఉంది నా మనస్సులో' అని ఊహించుకొని సిగరెట్టు అందిచ్చి ఊరుకొన్నాడు.

తరువాత పదినిముషాలలో కారు ఆయన యింటిముందు ఆగింది. కాఫీ తెప్పించారు. ఇద్దరం తాగుతున్నాము.

ఒక నిమిషం అయిన తరువాత 'ఏమండీ అల్లా ఉన్నారు? నా ఉత్తరం అందిందా?' అన్నాడు.

కొంప మునిగింది. ఇక చెప్పుల విషయమే వస్తుందనుకొని, ఆయన ఆ విషయమై అడగకముందే చెప్పేస్తే మర్యాదగా ఉంటుందని తల ఒంచుకొని దీనంగా అన్నాను. 'ఆ చెప్పులు పోయినై అండి' అని.

ఆయన ఏదో విచిత్రంగా, ఏమీ అర్థంకానట్టు చూస్తూ 'ఆ చెప్పు లేమిటి! ఏ చెప్పులు?' అన్నాడు.

ఈ చెప్పుల విషయం ఆయన మనస్సులో ఏమీ లేదన్న మాట! నేను అనవసరంగా ఆందోళన పడ్డట్లుంది

అనుకొని జరిగినసంగతీ, నేను మానసికంగా పడ్డబాధ అంతా చెప్పాను.

డాక్టరుగారు విరగబడినవ్వి ఇల్లా అన్నాడు. 'అయ్యయ్యో! మీరు అకారణంగా బాధపడ్డారు.'

'మీరు ఈ ఊరు వచ్చినప్పుడల్లా ఇక్కడికి వచ్చి మాతో కాసేపు మాట్లాడి నవ్విస్తూ ఉండేవారు. మీరు రావటం మానేస్తే మాకు కష్టం వేసింది. అందుకని మిమ్ములను రమ్మని గట్టిగా వ్రాశాను. అంతేగాని చెప్పులసంగతి అడగటానికి కాదే! అసలు ఆవిషయము మేము ఎవ్వరూ ఎప్పుడూ అనుకోనే లేదు.

"ఆ రోజున మీరు వెళ్ళిపోయిన తరువాత కాంతయ్యగారు 'నా చెప్పులు కనపడలేదండీ' అని వెతుక్కున్నాడు. మా అన్నగారు మీరు వదిలేసి వెళ్ళినచెప్పులు గుర్తించి, 'ఇంకేం, మావాడిచెప్పులు ఇక్కడున్నయి. మీవి తొడుక్కెళ్ళి ఉంటాడు. నేను వెళ్ళి చెప్పి పంపిస్తాను లెండి' అన్నాడు."

"కాంతయ్యగారు నవ్వుకొని 'పోనీలెండి. మళ్ళీ తీసుకువచ్చి ఇయ్యాలటండీ ఈ మహాద్భాగ్యం! ఆ చెప్పులు వారు తీసికొని వెళ్ళటం నాకూ సంతోషమే! ఇది నాభాగ్యం అనుకొంటాను' అని ఎంతో గౌరవంతోనూ ప్రేమతోనూ అన్నాడు. అంతేగాని ఎవ్వరూ ఏమీ అనుకోలేదు. తరువాత ఆసంగతే మరిచిపోయినాము. ఎవ్వరికీ జ్ఞాపకం లేదు – మీరు ఇప్పుడు చెప్పిందాకా!"

యీ మాటలు విని నేనూ సంతోషించాను. ఛీ. ఛీ, ఎంత ఆందోళనపడ్డానా అనవసరంగా అని నాలో నేను నవ్వుకొన్నాను.

అప్పుడు నాకు తోచింది-దీనికంతా కారణము అన్న గారు నాకు చెప్పిన మాటలేకదా అని! ఆయన నాకు కాస్త బాధ కలిగించినమాట నిజమేకాని ఆయన బహుశః నా తెలివి తక్కువతనం నాకే బాగా తెలిసి రావాలని అల్లాగ చెప్పి ఉంటారు.

అన్నగారు నాకు అల్లాగ చెప్పటమూ నేను భయపడ టమూ ఆ విషయాలన్నీ తలుచుకు తలుచుకు నవ్వారు డాక్టరు గారు. చివరకు ఆయన ప్రేమగా నా బుజంతట్టి కౌలనిమిరి, 'మీరు ఇంత పిచ్చివారేమండి! బాగానే ఉందిగాని, ఇక ఆ విషయం మరిచిపోండి. మిమ్ములను గురించి ఎవ్వరుగాని పొల్లుమాట అనలేదు. అంతా గౌరవంగా మాట్లాడారు.'

ఈ మాటవల్ల నాకు కొంచెం తృప్తి కలిగింది. 'కాంతయ్యగారు కూడా పాపం, మీయందు గౌరవంతో మాట్లాడారే కాని మరొకటికాదు. సంతోషించారు కూడా.'

డాక్టరుగారు చెప్పిన సంగతులు అన్నీవిని ఎంతో ఆనందించాను. ఆయనమళ్లీ ఇట్లా అన్నాడు. 'మీరు మన స్సులో ఏమీ కష్టపెట్టుకోవద్దు. ఏదో కాసేపు కులాసాగా మాట్లాడుకొందాము. మామూలుగా వస్తూ ఉండండి. చెపలు కావలసినప్పుడల్లా వచ్చి పట్టుకెళ్ళండి' అని పకపకా నవ్వాడు.

అదిగో ఆ చివరమాటే నాకు కష్టం కలిగించేది. కావలసినప్పుడల్లా పట్టుకెళ్ళండి అనట మేమిటి! ఒకప్పుడు మాత్రం నేనట్లా పట్టుకెళ్ళనా ఏమిటి? ఏమిటి ఆ మాటలు! అవే నాకు కష్టం కలిగించేవి!

ఈ కథ అందరికీ తెలిసింది. ఆ కాంతయ్యా, డాక్టరు గారూ, అందరికీ చెప్పారు. నవ్వులాటకే చెప్పివుంటారు. అయినా నాకు అప్రదిష్టవచ్చింది.

ఆరోజునుంచి నన్ను అందరూ ఒక విచిత్రవ్యక్తిలా చూస్తూన్నారు. నేను ఎక్కడైనా కూర్చుని మాట్లాడి వెళుతూఉంటే, అవతలవాళ్ళు ఎవరో ఒకరు 'మాస్టారూ, కాస్త వంచిజత చూసుకొని తొడుక్కెళ్ళండి. మళ్ళీ ఏమొ స్తారు' అనడం మొదలుపెట్టారు. నేను వెడుతూ ఉంటే నామీద ఒక కన్ను వేసే ఉంచుతారు – నేను బుద్ధిపూర్వకంగా ఎక్కడబడితే అక్కడ చెప్పులు ఎత్తుకెళ్ళే వాణ్ణిలాగ!

గొడుగు విషయంలోనూ అంతే. చెప్పులు ఎత్తుకెళ్ళే వాడు గొడుగులు ఎత్తుకెళ్ళకుండా వుంటాడా అని అనుకొంటారో ఏం కర్మమో! ఎవరూ నమ్మి నాకు గొడుగు ఇవ్వరుగదా, కాస్త అటు వెళ్ళొస్తానండీ అని అడిగితే! ఒకవేళ ఇచ్చినా, 'ఇక అదిరాదు. దానిని ఎక్కడో పారేసి వస్తాడు' అని అనుకొనే ఇస్తారు.

స్కూలులో మాస్టర్లు కూర్చునే గదిలో ఎవరిచెప్పుల జోడుగాని, గొడుగుగాని కనపడకపోతే, 'ఆయన ఎక్కడున్నాడో చప్పున చూడండి' అని ఎవరో ఒకరు అనక

అ ష్ట కృ

నా జీవితంలో ఒక్కసారి అల్లాంటి పొరపాటుపని చేశాను. మళ్ళీ ఎప్పుడూ చేయ లేదు.

జీవితంలో జరిగిన ఒక్క పొరపాటును ఆధారం చేసుకొని, లోకం నన్ను గురించి ఇల్లాగ అనుకోటం ధర్మమా! ఏదో పొరపాటు జరిగింది అని లోకం నన్ను క్షమించక ఇల్లాగ అనటం అన్యాయంకాదా? ఈ ప్రశ్నకు సమాధానం దొరక లేదు. అది ప్రశ్నగానే మిగిలిపోయింది!